క్లుప్తంగా

సొంత జిల్లాలకు పంపాలి

317 జీవో బాధితులపై రాష్ట్రీయ పండిత పరిషత్



రాంపూర్ గ్రామంలో పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నిజాంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సంక్రాంతిలోపు 317 జీవో బాధితులను వెంటనే సొంత జిల్లాలకు పంపించాలని రాష్ట్రీయ పండిత పరిషత్ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నాడు నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న సమయంలో పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మారెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, నరేశ్, కుమారస్వామి, షాదుల్లా పాల్గొన్నారు.

రాంపూర్ పాఠశాలల్లో వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం నాడు వైద్యాధికారులు పాఠశాల విద్యార్థుల బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ శాతం, పోషకాహారలోపం, చర్మవ్యాధులు, దంత సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేశారు. అనంతరం వారికి అవసరమైన మందులిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పద్మారెడ్డి మాట్లాడుతూ...శిబిరాల వలన విద్యార్థులలో ఉన్న పోషకాహారలోపాన్ని అరికట్టడంతోపాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో మరో వైద్యాధికారి సంతోషి, సిద్ధిరాములు, ఏఎన్ఎం జయంతి, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి అమానుషం

బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ గుప్తా



టేక్మాల్(మెదక్): బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం అమానుషమని బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ గుప్తా పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ...నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు గుడ్లు, రాళ్లతో దాడి చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ తీగ తెగిపడి గేదె మృతి



మృతి చెందిన గేదెను వీక్షిస్తున్న స్థానికులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన మల్లిగారి బాలమణి చెందిన పాడి గేదెను మేత మేసేందుకు శివారులో కట్టివేసింది. పైన వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడి గేదెపై పడటంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్‌శాఖ సిబ్బందికి సమాచారం తెలియజేయడంతో విద్యుత్ తీగలను మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. పాలు అమ్ముకుని జీవనం సాగించే తమకు అండగా ఉన్న గేదే మృతితో బాలమణి ఆవేదన వ్యక్తం చేసింది.

పాఠశాల మైదానం చదును చేయించిన ఎంపీపీ



పాఠశాల మైదానం చదును చేస్తున్న జేసీబీ

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మాజీ ఎంపీపీ చందన ప్రశాంత్‌రెడ్డి ఉన్నత పాఠశాల మైదానాన్ని మంగళవారం చదును చేయించారు. కొంతకాలంగా మైదానం రాళ్ల రప్పలు, మట్టి దిబ్బలతో, ఎగుడు దిగుడులుగా మారి, విద్యార్థులు ఆడుకోవడానికి, నడకకు ఇబ్బందిగా మారింది. ఉపాధ్యాయులు ఈ విషయాన్ని మాజీ ఎంపీపీ చందన ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, జేసీబీ సహాయంతో సుమారు మూడెకరాల మైదానాన్ని చదును చేశారు.



పెద్దశంకరంపేట పాఠశాల ఆవరణలో ముగ్గులు వేస్తున్న బాలికలు



జాతీయ రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఘనంగా రోడ్డుభద్రతా మాసోత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ అలరించాయి. రహదారి నిబంధనలు పాటించాలని కోరుతూ వివిధ రకాల ఆకృతులతో విద్యార్థులు అందంగా ముగ్గులు వేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశం, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్‌లో...

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో రోడ్డు నిబంధనలపై మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు వేసిన ముగ్గులు అందర్నీ అలరించాయి. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు లక్ష్మణ్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గిపోతాయన్నారు.

ఘనంగా జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రోడ్డు భద్రతపై వివిధ అంశాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. తమ ఆలోచన విధానాన్ని వివిధ రూపాల్లో విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా అక్కడి ఉపాధ్యాయులు,విద్యార్థులు ముగ్గులు వేశారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే జరిగే ప్రమాదాలు,ట్రాఫిక్ సిగ్నల్స్,తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

వెల్దుర్తి(తూప్రాన్): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని ముగ్గులను వేశారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు ముగ్గుల పోటీలు

కౌడిపల్లి(నర్సాపూర్): జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా కౌడిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు వారికి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ట్రాఫిక్ లైట్స్, జీబ్రా క్రాసింగ్, సేఫ్‌డ్రైవ్, సేవ్‌లైఫ్, స్టాప్, నోపార్కింగ్ వంటి అంశాలకు సంబంధించి ముగ్గులు వేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల సిబ్బంది బహుమతులు అందించారు.



రంగోలి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



రోడ్డు భద్రత చిహ్నాలతో ముగ్గులేస్తున్న విద్యార్థినులు

విద్యార్థులకు రంగోలి పోటీలు

పాపన్నపేట(మెదక్): రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని యూసుఫ్‌పేట పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుభద్రత చర్యలు, ట్రాఫిక్ సిగ్నల్, సూచిక బోర్డులను సూచిస్తూ విద్యార్థులు ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాలతీ దేవి,ఉపాధ్యాయులు వీరేశం,హీరాలాల్, రఫీక్,శ్రవణ్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలు, చిహ్నాలు అనే అంశంపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఆస్మా షాహీన్, లక్ష్మి ప్రసన్న, మాధవరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.



చేగుంట: విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



చిలప్‌చెడ్‌లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎస్సై నర్సింహులు



మెదక్ మున్సిపాలిటీ: ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని చిన్నశంకరంపేట ఎంఈవో పుష్పవేణి సూచించారు. చిన్నశంకరంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యశాల సిబ్బంది మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇప్పటివరకు 15 పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందించారని చెప్పారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కూడా ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



విద్యార్థికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది. చిత్రంలో ఎంఈవో పుష్పవేణి

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు

పాపన్నపేట మండలం చిత్రియాల్ అంగన్‌వాడి కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు, పుట్టినరోజు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. బాలింతలు, అంగన్‌వాడి టీచర్ అప్సరీ, పంచాయతీ కార్య దర్శి బాబు నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

– పాపన్నపేట(మెదక్)



చిత్రియాల్ అంగన్‌వాడి కేంద్రంలో నిర్వహిస్తున్న సామూహిక సీమంతాలు

ఇంటిపైకి టపాసులు

- పాక్షికంగా దెబ్బతిన ఇంటిపైకప్పు
- రాత్రివేళ పేలుడుతో ఉలిక్కిపడ్డ గ్రామస్తులు

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తుల ఓ ఇంటిపై టపాసులు వేశారు. దీంతో ఆ ఇంటి పైభాగం పాక్షికంగా ధ్వంసమైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నడిమింటి రాజమణి తన కుటుంబంతో సహా నిద్రిస్తుండగా ఒక్కసారిగా ఇంటిపై భారీ పేలుడు శబ్దాలు వినిపించడంతో నిద్ర నుంచి మేల్కొన్నారు. వెంటనే ఇంటి బయటకు వచ్చి చూడగా ఇంటి పైకప్పు పాక్షికంగా ధ్వంసమైంది. అర్ధరాత్రి వేళ పేలుడు శబ్దాలు వినిపించడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనపై బాధిత కుటుంబం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు అక్కడ్నుంచి కొన్ని బాంబులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



పేలుడు ధాటికి దెబ్బతిన్న ఇంటి పైకప్పు

పాతూర్ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో హైమావతి

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని పాతూర్ గ్రామంలో ఐసీడీఎస్ జిల్లా అధికారి హైమావతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాలు ఏ విధంగా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది గర్భిణులు, బాలింతలు వచ్చి భోజనం చేసి వెళ్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీల అభివృద్ధికి సహకరించండి

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ్

కౌడిపల్లి(నర్సాపూర్): ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని, మెరుగైన జీవన విధానం, ఆర్థిక అభివృద్ధి కోసం సదుపాయాలు కల్పించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మంగళవారం మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఊరట్ల శివతో కలసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివిధ మండలాల మాలమహానాడు అధ్యక్షులు యాదగిరి, కుమార్, ఈశ్వరయ్య, బాలగోపాల్, మైనార్టీ నాయకులు కుతుబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమంలో వక్తలు

కొల్చారం(నర్సాపూర్): ఆశావర్కర్లు మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారిక కేంద్రం,మిషన్ శక్తి జెండర్ ప్రత్యేకాధికారి నాగమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లకు మహిళలపై వరకట్న,లైంగిక వేధింపులు,బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆశావర్కర్లు

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దు

మెదక్ రూరల్ ఎస్‌ఐ మురళి

హవేళిఘణాపూర్(మెదక్): వాహనదారులు బయటకు వెళ్లే సమయంలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని మెదక్ రూరల్ ఎస్‌ఐ మురళి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లి గ్రామంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు.



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

పిల్లల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో కేసుల్లో బాధిత పిల్లల సంరక్షణకు భరోసా కేంద్రం ద్వారా మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్ భరోసా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ హాలు ద్వారా బాధితులు కోర్టుకు రాకుండా తమ వాంగ్మూలంను నేరుగా భరోసా సెంటర్ నుంచి కోర్టుకి నివేదించవచ్చన్నారు. ఇక నుంచి పోక్సో కేసు బాధితులు అందరూ ఇక్కడి నుంచే తమ సాక్ష్యాలను కోర్టుకి తెలియజేస్తారని పేర్కొన్నారు. ఎస్పీ భరోసా సిబ్బంది పనితీరును పరిశీలించి సూచనలు ఇచ్చారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న సెల్యూట్ బేస్‌ను స్లాబ్ పనులను ఆయన ప్రారంభించారు. అంతకుముందు పట్టణంలోని సఖి కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ అక్కడ అందిస్తున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం కో ఆర్డినేటర్ రేణుకకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ గౌడ్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, భరోసా సెంటర్ కో ఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ శ్వేత, సఖి సెంటర్ లీగల్ అడ్వైజర్ నిర్మల పాల్గొన్నారు.



భరోసా సెంటర్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

వరినాట్లు వేసిన విద్యార్థులు

సదాశివపల్లిలో గ్రామస్తుల జీవనశైలిపై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): స్టడీటూర్‌లో భాగంగా విజ్ఞానజ్యోతి విద్యార్థులు మంగళవారం సదాశివపల్లి గ్రామంలో పర్యటించి పొలాల్లో వరినాట్లు వేశారు. హైదరాబాద్ బాచుపల్లిలోని విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు కళాశాల డీన్ రవినాథ్, ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్‌హుస్సేన్, డాక్టర్ నాయక్ ఆధ్వర్యంలో 68 మంది విద్యార్థులు సదాశివపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, ప్రభుత్వ పథకాలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, మంచినీరు, ఉచిత విద్యుత్, గిట్టుబాటు కూలీ, పంటలసాగు, ఎరువులు, విత్తనాలు తదితర అంశాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింగారావ్, వీరయ్య గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



పంటపొలాల్లో వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న, కొట్టాల, లింగంపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో మంగళవారం శ్రీనివాస్ తనిఖీ చేశారు. గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు నిర్వహించిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలాంటి తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్‌రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.



సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

రైతు నేస్తం సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

వ్యవసాయశాఖ జిల్లా అధికారి విన్సెంట్ వినయ్

చిన్నశంకరంపేట(మెదక్): రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ నిపుణులు అందించే సలహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి విన్సెంట్ వినయ్ కోరారు. నార్సింగి రైతువేదికలో మంగళవారం రైతులతో కలసి రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న సాగు, సస్య రక్షణ చర్యలపై జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు అందించే సలహాలు ఉపయోగించుకోవాలన్నారు.

రూ. 2 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు

కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): ఉమ్మడి చేగుంట మండలానికి సీసీ రోడ్ల నిర్మాణాల కోసం రూ.2 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. చేగుంట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. చేగుంట, నార్సింగి మండలాలల్లోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాల కోసం మంత్రి కొండా సురేఖతో నిధులు మంజూరు చేయించానన్నారు. సమావేశంలో చేగుంట నార్సింగి కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నవీన్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు స్టాలిన్, వెంకటేశ్, మాజీ సర్పంచులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



చేగుంటలో అభివృద్ధి నిధుల వివరాలను వివరిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

ఫార్మాసిస్టులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

నర్సాపూర్ రూరల్: ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఫార్మాసిస్టులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీర్జా నజీమ్ బేగ్ పేర్కొన్నారు. నర్సాపూర్‌లో విష్ణు ఫార్మా కళాశాలలో మూడు రోజులపాటు జరిగే లైఫ్ సైన్స్ రంగంలో నైపుణ్యాభివృద్ధి మండలి, ఫార్మా కౌన్సిల్ ఆఫ్ ఇండియా శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఫార్మా విద్యార్థులతోపాటు ఫార్మాసిస్టులు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిగా నర్సాపూర్ విష్ణు ఫార్మా కళాశాలలో పీఎంకేవీవై పథకం ద్వారా ఫార్మా కోవిజిలెన్స్ కోర్సును ప్రవేశపెట్టారన్నారు. ఇలాంటి కోర్సులతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మీర్జాబేగ్‌కు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ బైలా కో చైర్మన్ ఆఫ్ డ్రగ్గిస్ట్ అండ్ కెమిస్ట్ గరిపల్లి శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



మీర్జా బేగమ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ఆశాలకు గౌరవ వేతనం చెల్లించాలి

తూప్రాన్: ఆశాలకు పనికి తగిన గౌరవ వేతనం చెల్లించాలని ఆశాల వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు శారద డిమాండ్ చేశారు. గత తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నా ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు రూ.18 వేల వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు వేతనం పెంచాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సునీత,లక్ష్మి,నిర్మల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.